




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 290

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 4 ఏప్రిల్ 2026


## దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి

● వైసీపీ నాశనం చేస్తే -మేం శాసనం చేశాం ● దేశమంతా మద్దతిస్తే వైసీపీ ఒక్కటే వ్యతిరేకించింది ● పార్లమెంటులో చేసిన చట్టాన్నీ గౌరవించరా? ● వైసీపీకి రాష్ట్ర ప్రజలు, వారి ప్రయోజనాలంటే లెక్కలేదు ● ఇక అమరావతిని ఎవరూ మార్చలేరు,కదల్చలేరు ● మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, కలంకౌంటర్ :** ఒక్క వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలు ఏపీ రాజధాని అమరావతికి అండగా నిలిచాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో అన్ని రాజకీయ పార్టీలూ, ఎంపీలు అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లుపై మద్దతు పలికితే ఒక్క వైసీపీ ఎంపీలు మాత్రమే వ్యతిరేకించి వాకౌట్ చేశారని వ్యాఖ్యానించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం, రాజధాని ఏర్పాటు, అమరావతి ఎంపిక, వైసీపీ కుట్రలు, రాజధాని రైతుల ఉద్యమం, అసెంబ్లీ, మండలిలో జరిగిన పరిణామాలు, న్యాయ పోరాటం, రాజధాని పునర్నిర్మాణం వంటి అంశాలను సీఎం వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఒక్క పార్టీ మినహా దేశంలోని పార్టీలన్నీ రాజధానికి అండగా నిలిచాయి. లోక్ సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తూ 50 పార్టీలు ఉంటే వాటిల్లో వైసీపీ మినహా అన్ని పార్టీలు అమరావతికి మద్దతు ఇచ్చాయి. రాష్ట్రపతి ఆమోదం తర్వాత దీనికి పూర్తి స్థాయి చట్టబద్ధత వస్తుంది. అన్ని విధాలా సహకరించిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు. లోక్ సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ పార్లమెంటులో ఉండే అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలకు కృతజ్ఞతలు. రాజకీయ వైరుధ్యాలు, వ్యక్తిగతంగా భిన్నాభిప్రాయాలున్నా అన్ని పార్టీలు సహకారం ఇచ్చాయి. కొందరికి రాష్ట్రం గురించి తెలియదు.. ఈ రాష్ట్రంతో అవసరం కూడా ఉండకపోవచ్చు...కానీ అలాంటి పార్టీలు కూడా రాజధాని చట్ట బద్ధత కల్పించే బిల్లుకు సహకరించాయి. అనుకూలంగా ఓటేశాయి. కానీ ఈ రాష్ట్రంలో ఓట్లు పొంది, ఇక్కడి నుంచి ఎంపీలుగా ఎన్నికైన వ్యక్తులు ఈ రాష్ట్రానికే ద్రోహం చేసేలా వ్యవహరించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించారు. దేశంలోని పార్టీలన్నీ ఓవైపు ఉంటే... వైసీపీ మాత్రం మరోవైపు నిలిచింది. వైసీపీ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రాంతీయ పార్టీలు సహకరిస్తాయి. కానీ రాష్ట్రం నాశనమైనా పర్వాలేదనే రీతిలో జగన్ సూచనల మేరకు వైసీపీ ఎంపీలు వ్యవహరించారు. అమరావతి నాశనమై పోయినా పర్వాలేదనుకున్నారు. కానీ మనం దానిపై శాసనం చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజ ముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు."అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**ప్రతీ ఇటుకా పేర్చుకుంటూ వచ్చాం...**"విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. చాలా అంశాలకు పరిష్కారం చూపకుండానే విభజన జరిగింది. ఆర్థిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే పోలవరం 7 ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించాం. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడ- గుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమన్నారు. ఆ సంకల్పంలో భాగమే ఉత్తరాంధ్ర-దక్షిణాంధ్ర, రాయలసీమల మధ్య సమాన దూరంలో ప్రాంతాన్ని ఎంపిక చేశాం. కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశాం. అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక, భూ సమీకరణ, సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేశాం. సింగపూర్ ఒక్క పైసా తీసుకోకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చింది. పిలుపు ఇవ్వగానే 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలను ఇచ్చారు. ప్రభుత్వ భూమి కూడా కలిపితే 54 వేల ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధిలో రైతులను కూడా భాగస్వాములను చేసేలా వినూత్నమైన ల్యాండ్ పూలింగ్ స్కీమ్ తెచ్చాం. తమ భవిష్యత్తు బాగుంటుందని రైతులకూ విశ్వాసం కలిగింది. జరీబు భూములిచ్చిన వారికి 450 కమర్షియల్, 1000 గజాలు రెసిడెన్షియల్ రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చాం. ప్రతీ ఏటా యాన్యుటీ కూడా రైతులకు ఇస్తున్నాం. భూమి లేని రైతులకు కూడా పెన్షన్లు అదనంగా ఇస్తున్నాం. భూములు

- 2లో

## యూడీఎఫ్ మేనిఫెస్టోతో కేరళకు స్వర్ణయుగం: సీఎం రేవంత్ రెడ్డి



**తెలంగాణ, కలంకౌంటర్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా గడిపారు. తిరువనంతపురంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఎన్నికల మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. ఈ మేనిఫెస్టో కేరళ రాష్ట్రానికి ఒక "స్వర్ణయుగానికి నాంది" పలుకుతుందని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... యూడీఎఫ్ అధికారంలోకి వస్తే కేరళ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తోందో, కేరళలోనూ అదే తరహా అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. యూడీఎఫ్ మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు. 'న్యాయ్' పథకం కింద పేద కుటుంబాలకు నేరుగా ఆర్థిక సాయం, సామాజిక భద్రతా పెన్షన్ల పెంపు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన వంటి కీలక హామీలను పొందుపరిచారు. వీటితో పాటు వ్యవసాయ రంగంలో సంస్కరణలు, మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి కేరళలోని ప్రస్తుత ఎల్డీఎఫ్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. కేరళ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, యూడీఎఫ్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేరళలో కాంగ్రెస్ గెలుపు దేశవ్యాప్తంగా లౌకిక శక్తులకు మరింత బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

## సూక్ష్మ సేద్యంలో అగ్రస్థానంలో ఏపీ

● రాష్ట్రంలో 1.26 లక్షల హెక్టార్ల పరిధిలో సూక్ష్మ సేద్యం

● రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపినందుకు అధికారులకు సీఎం చంద్రబాబు అభినందనలు



**అమరావతి,కలంకౌంటర్ :** మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (APMIP) అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి, రికార్డు స్థాయిలో 1,26,057 హెక్టార్లను సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకువచ్చిన అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ తర్వాత 1.05 లక్షల హెక్టార్ల మైక్రో ఇరిగేషన్ సాగుతో గుజరాత్ రెండో స్థానంలో ఉందన్నారు. ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు చేసిన కృషిని కొనియాడారు. ఈ పథకాన్ని వినియోగించుకుంటున్న 1,08,143 మంది రైతులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆధునిక సాగు పద్ధతుల ద్వారా వారికి నాణ్యమైన దిగుబడి, అధిక లాభాలు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ముఖ్యంగా డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను అవలంభిస్తున్న రైతులకు నీటి పొదుపుతో పాటు సాగు ఖర్చు తగ్గి, ఆర్థికంగా నిలదొక్కుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. టమాటా, ఆయిల్ పామ్, మిర్చి వంటి పంటల నుంచి పప్పు ధాన్యాల వరకు వైవిధ్యమైన పంటలు సాగు చేస్తున్న రైతాంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా రూ. 1030 కోట్ల మేర సబ్సిడీని రైతులకు అందించామన్నారు. మైక్రో ఇరిగేషన్‌ను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ.. అర్హులైన ప్రతి రైతుకూ సకాలంలో సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని వేల హెక్టార్లను సాగులోకి తెచ్చి, ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా మార్చడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

## ఇరిగేషన్ పనుల అంచనాల తయారీలో అధికారుల అలసత్వం

● అధికారులు తీరు మార్చుకోవాలన్న మంత్రి నిమ్మల ● ఆదివారంలోగా అంచనాలు సమర్పించాలని ఆదేశం ● సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు.



**అమరావతి,కలంకౌంటర్ :** గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చు కోవాలని హెచ్చరించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటి వరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారాయన. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బందిపడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్థిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు మంత్రి నిమ్మల రామానాయుడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు.






## విద్యార్థులతో మంత్రి సవితమ్మ





**సత్యసాయి జిల్లా,కలంకౌంటర్ :** పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం కేజీబీవీ పాఠశాలను లిరాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత ు జౌళి శాఖల మంత్రి సవిత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి సౌకర్యాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఆమోదం లభించిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలో విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది , పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. .

## బలమైన రాజధాని - సమాన అభివృద్ధి - శ్రేయస్సు కలిగిన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కృషి చేయాలి - సామాజికవేత్త కర్లపాటి



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిపై చట్టసభల్లో ఆమోదం పొందడం ఒక కీలక పరిణామం అయితే దీని అమలు దశలో స్పష్టత అవసరమని సామాజిక కార్యకర్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజల సమగ్ర అభివృద్ధి దృష్టితో చూడాలన్నారు. రాజధాని నిర్మాణం రాష్ట్ర పరిపాలన, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని ఈ అంశంలో స్థిరత్వం, స్పష్టత, పారదర్శకత అత్యంత అవసరం అన్నారు. ముఖ్యంగా అమరావతి ప్రాంత రైతులు తమ భూములను ఇచ్చిన నేపథ్యంలో వారి నమ్మకాన్ని నిలబెట్టడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా సమగ్ర దృష్టితో ముందుకు సాగాలని కోరారు. వివాదాలు కాదు అభివృద్ధి , విభజన కాదు సమగ్రత, రాజకీయాలు కాదు ప్రజల ప్రయోజనం ముఖ్యమని అన్ని రాజకీయ పార్టీలు ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు కలిసి రాష్ట్ర భవిష్యత్తు కోసం నిర్మాణాత్మకంగా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. బలమైన రాజధాని సమాన అభివృద్ధి శ్రేయస్సు కలిగిన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమతుల్య అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యతగా కొనసాగాలన్నారు.

## తిరుమలలో భక్తుల రద్దీ.. శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం



**తిరుమల,కలంకౌంటర్ :** వారాంతం కావడంతో తిరుమల కొండకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు 31 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనం చేసుకునేందుకు సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న గురువారం (ఏప్రిల్ 2) ఒక్కరోజే 62,642 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 23,887 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ. 4.18 కోట్ల ఆదాయం వచ్చినట్టు టీటీడీ వెల్లడించింది. కాగా, భక్తులు తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకునే ముందు దర్శన సమయాన్ని గమనించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రద్దీ దృష్ట్యా భక్తులకు ఇబ్బంది కలగకుండా టీటీడీ అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది.

## ఆలయ ప్రతిష్ట



**గూడూరు (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** గూడూరు మండలంలోని కంచ కోడూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మాజి డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్.

# దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి

### ● మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ఇచ్చిన వారంతా సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతోనే ఇవన్నీ చేశాం. సిటీ రీజియన్ 56 మండలాలు, 8603 చదరపు కిలోమీటర్ల మేర, 117 చదరపు కిలోమీటర్ల క్యాపిటల్ సిటీని నిర్దేశించాం. సింగపూర్ మాస్టర్ ప్లాన్ తో నిర్మాణం ప్రారంభించేందుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దేశంలో ఉండే పవిత్రమైన దేవాలయాలు, ప్రార్ధనా లయాల నుంచి మట్టిని, నదుల నుంచి నీటిని తెప్పించాం. ప్రధాని కూడా పార్లమెంటు నుంచి మట్టిని, యమునా జలాలను తీసుకువచ్చారు. పార్లమెంటు, యావత్ దేశం అంతా అండగా ఉంటుందనే ఆ మట్టిని, నీటిని తెచ్చినట్టు ప్రధాని చెప్పారు. 11 నెలల్లో సచివాలయం, అసెంబ్లీ భవనాలను నిర్మించాం. 2016 జూన్ నుంచే ప్రభుత్వ కార్యకలాపాలన్నీ అమరావతి నుంచే నిర్వహించాం. 9 నగరాలుగా అమరావతిని నిర్మించాలని ప్రణాళికలు చేశాం. నాలుగు ఆఫీసు భవనాలు నిర్మిస్తే రాజధాని అయిపోదు. భవిష్యత్ తరాలు శాశ్వతంగా రాజధాని ప్రాంతాన్ని వినియోగించుకోవాలి. ప్రపంచ శ్రేణి ఆర్కిటెక్టులను నియమించాం. నార్మన్ ఫోస్టర్స్ ద్వారా బ్లూ గ్రీన్ సిటీగా అమరావతిని అధునాతన నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేశాం. స్టాక్ ఎక్స్ఛేంజిలో అమరావతి బాండ్స్ విడుదల చేస్తే గంటలో రూ. 2 వేల కోట్లు వచ్చాయి. అంతటి క్రెడిబులిటిని అమరావతి నగరం సొంతం చేసుకుంది."అని సీఎం చంద్రబాబు వివరించారు.

**వైసీపీవి కుళ్లు...కుట్రలు..కుతంత్రాలు..** "రాజధాని విషయంలో వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. అమరావతిని వ్యతిరేకించినా గత పాలకులు గతిలేని పరిస్థితిలో ఇక్కడి నుంచే పాలన సాగించారు. వాళ్లు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారు. అమరావతికి అనుకూలంగా అడుగు పడిన సమయంలోనే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. అమరావతిపై వ్యతిరేకతతో ప్రపంచబ్యాంకుకు కూడా లేఖలు రాశారు. అరాచకం సృష్టించే ప్రయత్నించారు. అరటి తోటలు తగుల బెట్టారు. తప్పుడు రిపోర్టులు తెప్పించారు. ఎడారి, శ్మశానం అన్నారు. భూకంపాలు వస్తాయన్నారు. ఎన్ని విధాల రాజధానిని నష్టపరచాలో అంతా చేశారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు. సింగపూర్ దేశం పైనా అభాండాలు వేసి ఒప్పందాలు రద్దు చేశారు. అమరావతి బ్రాండ్ దెబ్బతీశారు. విట్,ఎస్ఆర్ఎం లాంటి ప్రతిష్టాత్మక వాటి పేర్ల చివరిలో అమరావతి క్యాంపస్ అని పెడితే దానిని తీసేయమని వారిపై ఒత్తిడి తెచ్చారు. 1,307 ఎకరాలను 113 సంస్థలకు రాజధానిలో భూములు కేటాయించాం. వేల మంది కార్మికులతో ముమ్మరంగా పనులు జరిగే సమయంలో వాటిని ఆపేశారు. మూడు రాజధానుల ప్రకటన చేసి.. మూడు ప్రాంతాల్లో వివాదం సృష్టించేలా ప్రయత్నించారు. హైకోర్టు కూడా దీనిపై వారికి మొట్టి కాయలు వేసింది. అమరావతి రైతుల ఉద్యమానికి కౌంటర్ గా పెయిడ్ ఆర్టిస్టులతో క్యాంపులు పెట్టించారు. ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు కేసులు పెట్టించారు. నాపై రాళ్లు వేయించారు. అదేమంటే భావప్రకటన స్వేచ్ఛ అని డీజీపీతో మాట్లాడించారు. పవన్ కల్యాణ్ వస్తే ముళ్లకంచెలు అడ్డం పెట్టారు. రాజధానిపై కుట్రలు చేసిన వ్యక్తిని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిని నియంత అనాలా లేక ఏమనాలో తెలీటం లేదు. ఈ కుట్రలను కుతంత్రాలను ప్రజలు విశ్వసించలేదు. మాకు మళ్లీ ప్రజలు పట్టం కట్టారు."అని సీఎం చెప్పారు.

**అమరావతి భవిష్యత్ నగరం..** "భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తొట్టతొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది. అందుకే ఈ తీర్మానం పెట్టి పార్లమెంటుకు పంపితే.. దానికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. విద్య, ఉద్యోగం, విజ్ఞానం లాంటి అంశాలకు నెర్వ్ సెంటర్ గా అమరావతి మారుతుంది. దేశానికి ఒక ఫ్యూచర్ సిటీ కూడా అవసరం.. అదే అమరావతి. అమరావతి అభివృద్ధితో పాటు విశాఖ, తిరుపతి లాంటి ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం. రీజియన్లుగా ఆయా ప్రాంతాల్లో వేర్వేరు పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలు వస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి నీటి భద్రత తీసుకువస్తాం. ఒంటిమిట్టలో శ్రీరామ కల్యాణంలో పాల్గొన్న వేళ లోక్ సభలో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందింది. నిన్న రాజ్యసభలో బిల్లు పాస్ అయిన వేళ పోలవరం డయాఫ్రామ్ వాల్ కూడా పూర్తి అయ్యింది. శుభపరిణామాలు వరుసగా జరుగుతున్నాయి. గత పాలకులు నిలిపిన అమరావతి నిర్మాణాల్ని మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ చేతుల మీదుగా పునర్నిర్మాణం మొదలు పెట్టాం. స్వాతంత్ర్య భారత దేశంలో మూడు రాజధానుల డ్రామా ఆడిన వ్యక్తులు ఎవరూ లేరు. అమరావతి దేశానికి ప్రైడ్ గా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ కు గుండె, ఆత్మ ఇది. ఎవరు ఏమి చేసినా అమరావతి సంకల్పం ఆగదు, ప్రపంచ బ్యాంకు, హడ్కో, ఏడీబీ నుంచి ఫైనాన్షియల్ టై అప్ ఉంది. ప్రస్తుతం రూ.56 వేల కోట్ల విలువైన పనులు రాజధానిలో జరుగుతున్నాయి. 2028 నాటికి రాజధానిలో ప్రధాన మైన పనులన్నీ ఓ కొలిక్కి వస్తాయి. రాజధానికి లక్షల కోట్లు కావాలని కొందరు మాట్లాడుతున్నారు. కానీ నిర్మాణం ఒక్క రోజులో పూర్తి అయ్యేది కాదు. ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ ఇలాంటి వేర్వేరు ప్రాజెక్టులు నిర్మితం అవుతూనే ఉంటాయి. క్రమానుగుణంగా రాజధాని నిర్మాణం, అభివృద్ధి జరుగుతుంది. కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలతోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. హైదరాబాద్ ఒక్కటే తెలంగాణాలో గరిష్ట ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది. మౌలిక సదుపాయాల నిర్మాణం పూర్తి అయితే అభివృద్ధి ఆటో పైలట్ గా జరిగిపోతుంది. ప్రపంచంలోని వేర్వేరు ప్రాజెక్టులు ఈ మోడల్ లోనే అభివృద్ధి అయ్యాయి. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. దానికి చోదకశక్తిగా అమరావతి నిలుస్తుంది. 2029లో ప్రధాని మోదీతో ఈ ప్రాజెక్టులన్నీ ప్రారంభింపచేస్తాం. అమరావతి అజేయం, శాశ్వతం, అన్ స్టాపబుల్. దీనికి అడ్డంకి కలిగించాలని చూస్తే వారివి పగటి కలలుగానే మిగిలిపోతాయి. అమరావతి ప్రజా రాజధాని. రాష్ట్రంలోనూ, రాజధానిలోను ప్రజలు నిత్యం ఆనందంగా ఉండేలా చూడాలని నేను నిత్యం భగవంతుడిని వేడుకుంటూనే ఉంటాను."అని ముఖ్యమంత్రి తెలిపారు.

**బుద్ధి మార్చుకోని వైసీపీ..** "ప్రజలు, దేశం యావత్తూ అమరావతి వైపు ఉంటే... వైసీపీ నేతలు ఇంకా అహంకారం ప్రదర్శిస్తున్నారు. ఉభయ సభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందితే ఓర్వలేక పోతున్నారు. ఎక్కడ కూర్చొంటే అక్కడే రాజధాని ఏమిటి...? పార్లమెంటు ఓ చట్టం చేస్తే దానిని అమలు చేయాల్సిన రాజకీయ పార్టీలు నా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తా మంటే ఎలా...? ప్లాన్ ఏ, ప్లాన్ బీ అంటూ మాట్లాడటం ఏమిటి..? ప్లాన్ ఏలో మూడు ముక్కలాటలు, ప్లాన్ బీలో మావిగన్. ఇలాంటి విపరీత మనస్తతత్వం ఏమిటి..? దేశమంతా ఆంధ్రప్రదేశ్ కు మద్దతు పలికి అమరావతి నిర్మాణం కావాలని, దేశాభివృద్ధికి దోహదం చేయాలని సంఘీభావం తెలియచేశారు. వారందరినీ తప్పుపట్టేలా వైసీపీ వింత ప్రవర్తన ఉంది. ఇంత కుట్ర, విధ్వంసం చేసి మళ్లీ ఎదురు దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు జాతి చాలా సమస్యల్ని ఎదుర్కొంటూనే ఉంది. మొన్నటి వరకూ మనకు ఉనికి లేని పరిస్థితి. ఇప్పుడు మన వాళ్లే ఏపీకి ఉనికి లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు. బెదిరింపులతో పెట్టుబడిదారులను తరిమి వేయటం నీచాతి నీచం. అప్రజాస్వామికంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠినంగా ముందుకు వెళ్తాం. చరిత్ర ఎప్పుడూ సానుకూల, వ్యతిరేక అంశాలను గుర్తుంచుకుంటూనే ఉంటుంది. అలాంటి వారిని చరిత్ర క్షమించదు. ఇలాంటి వ్యక్తుల విధానాల వల్ల ఏపీ అప్పుల్లో కూరుకుపోయింది. దక్షిణాదిలోనే తలసరి ఆదాయంలో అతితక్కువ స్థాయిలో ఉంది. తుగ్లక్ లు కొత్తగా పాలనలోకి వచ్చి రాజధానిని ప్రతీ సారీ మారుస్తా మంటే ఎలా...? దీనికి అర్థం ఉంటుందా...? శాశ్వత రాజధాని అని పార్లమెంటు చట్టం చేస్తే దానిని కూడా మార్చేస్తామని మాట్లాడతారా...? ఇదేం రాజకీయం...? ఇలాంటి నాయకులు ఉండటం రాష్ట్ర దౌర్భాగ్యం, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కూడా అవహేళన చేసి మాట్లాడతారా...? ప్రజలకు, ప్రజాధనానికి నష్టం జరిగేలా వ్యవహరిస్తారా...? ప్రజలకు సంక్షేమం, జీవన ప్రమాణాలను కల్పించటంపైనే ఎవరైనా మాట్లాడుకోవాలి. కానీ ఇలాంటి వారిపట్ల మాట్లాడటం కూడా అనవసరం."అని సీఎం అభిప్రాయపడ్డారు.

**కేంద్రం పూర్తిగా సహకరిస్తోంది..** "ప్రపంచం అంతా ఒకవైపు మాట్లాడితే... ఒక పార్టీ, వ్యక్తి మాత్రం వేరే విధంగా మాట్లాడుతున్నారు. అమరావతి అని పలకటం కూడా వారికి ఇష్టం లేదు. అందుకే ఈ తరహాగా వ్యవహరిస్తున్నారు. శ్రీవేంకటేశ్వర స్వామికి ఘోర అపచారం చేసి సమర్ధించుకున్న వాళ్ల ప్రవర్తనను ఇంకేం ఊహిస్తాం. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని అంతా కలిసి నిర్ణయిస్తే.. మళ్లీ ఆ చట్టాన్ని మార్చే ప్రయత్నం చేస్తారా...? అలాంటి అవకాశమే లేదు. గత పాలకులు 5 ఏళ్ల కాలంలో విభజన హామీల్లో ఒక్కటీ సాధించ లేకపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరానికి, అమరావతికి, విశాఖ స్టీల్ ప్లాంట్ కు, రైల్వే జోన్ కు, రాయలసీమ హార్టీ కల్చర్ హబ్ కు నిధులు సాధించగలిగాం. డబుల్ ఇంజన్ సర్కారుగా కేంద్రం, రాష్ట్రం కలసి పనిచేస్తున్నాం. ఏపీకి రావాల్సిన నిధులన్నీ వస్తూనే ఉన్నాయి. విభజన కంటే ఏపీకి జరిగిన నష్టం వైసీపీ హయాంలోనే ఎక్కువ జరిగింది. 30 ఏళ్లు వెనక్కు వెళ్లాం. ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టిమరీ అప్పులు తెచ్చారు. మేం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు వేసుకుని పాలన సాగిస్తున్నాం. ఎక్కువ వడ్డీలకు తెచ్చిన అప్పులను రీ షెడ్యూలు చేసుకుని భారం తగ్గించుకుంటున్నాం. ఒక వ్యక్తి వచ్చి పిచ్చి చేష్టలు చేసి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు."అని ముఖ్యమంత్రి అన్నారు. అంతకు ముందు పార్లమెంటు ఉభయ సభల్లోనూ అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందటంపై ముఖ్యమంత్రికి మీడియా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వారికి మిఠాయిలు పంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన చింతమనేని







**దెందులూరు,కలంకౌంటర్ :** దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ శుక్రవారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పనులు మరియు ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జగదాంబ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ నిధుల ద్వారా దెందులూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే సీఈఓ మరియు ఇతర అధికారులతో చర్చించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు , కార్యకర్తలు ఎమ్మెల్యే ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసారు. పలువురు నేతలు, అభిమానులు తమ ప్రాంతాల్లో జరగబోయే కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే కి అందజేశారు. అదేవిధంగా, నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వినతులు స్వీకరించారు. స్థానిక సమస్యలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకూడదని ఎమ్మెల్యే చింతమనేని అధికారులకు స్పష్టం చేశారు.

## విశాఖ చేరుకున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

- ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఎం అభిషిక్త్ కిశోర్,
- నగరం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం విశాఖపట్నం చేరుకున్నారు. జిల్లా పర్యటన నిమిత్తం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయనకు విశాఖలోని ఐ.ఎన్.ఎస్. డేగా విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, నగరం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.


## మర్యాద పూర్వక కలయిక



**హైదరాబాద్,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని జూబ్లీ హిల్స్ నివాసంలో జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేష్ షా , మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయతీర్థ చారి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవలసిన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి , మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వసూళ్లు ప్రజల కు ఇబ్బందులు

–కే కే రాజు వైసీపీ జిల్లా అధ్యక్షుడు



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** కైలాసగిరి పర్యాటక ప్రాంతంలో ఇటీవల అమలు చేస్తున్న కొత్త టికెట్ విధానం, పార్కింగ్ ఛార్జీలు మరియు వివిధ రకాల అదనపు వసూళ్లు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండా, కనీస సమాచారం ఇవ్వకుండానే ఈ విధానాన్ని అమలు చేయడం తీవ్రంగా ఖండనీయము. ఇప్పటివరకు వాహనాలకు మాత్రమే టోల్ రుసుం వసూలు చేయగా, తాజాగా వాహనంలో ప్రయాణించే ప్రతి వ్యక్తిపై అదనంగా రూ.10 చొప్పున వసూలు చేయడం అన్యాయంగా ఉంది. ఈ నిర్ణయం కారణంగా కుటుంబాలతో, స్నేహితులతో కలిసి వచ్చే పర్యాటకులు అనవసర ఆర్థిక భారం భరించాల్సి వస్తోంది. ప్రజలకు విశ్రాంతి, వినోదం కలిగించే ప్రదేశంగా ఉండాల్సిన కైలాసగిరిని ఆదాయ వనరుగా మార్చి సాధారణ ప్రజలపై భారాలు మోపడం సరైన విధానం కాదు. ఇలాంటి చర్యలు పర్యాటక అభివృద్ధికి ప్రతికూలంగా మారడమే కాకుండా ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. అందువల్ల వెంటనే ఈ పెరిగిన టికెట్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నాము. లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాము.

# వేసవి కాలంలో దొంగతనాలు పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** వేసవి కాలంలో జిల్లాలో దొంగతనాలు జరిగేందుకు అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. వేసవి కాలంలో చాలా మంది కుటుంబ సమేతంగా ప్రజలు స్వగ్రామాలకు, పర్యటనలకు వెళ్ళడం, ఇళ్ళను ఖాళీగా వదిలి ఇతర ప్రాంతాలకు వెల్లడం, ఆరుబయట నిద్రించడం వలన దొంగతనాలు, చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కావున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళే సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, మున్సిపల్ ప్రాంతాల్లో అనగా విజయనగరం 1వ, 2వ పట్టణ, రూరల్, నెల్లిమర్ల, రాజాం, బొబ్బిలి ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం (ఎల్.హెచ్.ఎం.ఎస్) సేవలను వినియోగించు కోవాలన్నారు. పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వడం వలన గస్తీ, పెట్రోలింగు సమయాల్లో ఆయా ఇళ్ళపై ప్రత్యేకంగా నిఘా పెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఎల్.హెచ్.ఎం.ఎస్. యాప్ ను మొబైల్ ఫోన్లలో డౌన్లోడు చేసుకొని, పోలీసుశాఖకు రిక్వెస్ట్ పంపినట్లయితే స్థానిక పోలీసులు ఆయా ఇండ్ల పరిసరాల్లో ప్రత్యేకంగా కెమెరాలను ఏర్పాటు చేసి, ఆయా ఇండ్లను నిరంతరం గమనిస్తూ, పర్యవేక్షిస్తుంటారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. అదే విధంగా పరీక్షలు పూర్తయి వేసవి సెలవులు కారణంగా ఇంటి వద్దనే ఉంటున్న తమ పిల్లలను ఒక కంట కనిపెడుతుండాలన్నారు. ఈతల కోసం చెరువులు, నదులు, నూతుల్లో దిగకుండా చూడాలని, నిపుణుల పర్యవేక్షణలోనే ఈత నేర్చుకొనే శిక్షణ పొందాలన్నారు. పిల్లల్లో నైతిక విలువలు పెంచేందుకు, వారిలో క్రీడా ప్రతిభను, డ్రాయింగ్, సింగింగు, డాన్స్ వంటి సృజనతాత్మకమైన కళలను, నైపుణ్యాలను వెలికితీసే విధంగా చర్యలు చేపట్టాల న్నారు. పిల్లలు చెడు స్నేహాలకు, వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా వారి ప్రవర్తనను గమనిస్తుండాలని, వారిపై ప్రేమ కనబరుస్తూనే వారు ఎక్కడకు వెళ్ళింది, ఎవరితో స్నేహం చేస్తున్నది, వారు ఏమి చేస్తున్నది గమనించాలని తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ ఎ.అర్.దామోదర్ సూచించారు. వేసవి కాలంలో దొంగతనాలను నియంత్రించేందుకు జిల్లా పోలీసుశాఖ నైట్ పెట్రోలింగును, గస్తీని ముమ్మరం చేస్తున్నప్పటికి, ప్రజలు కూడా దొంగతనాల నియంత్రణకు తమవంతు బాధ్యతగా కొన్ని జాగ్రత్తలను పాటించాలని కోరారు. ప్రజలు అప్రమత్తం గా ఉంటూ దొంగతనాలు జరగకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలని కోరుతూ జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కొన్ని సూచనలు చేసారు.

**కొన్ని ముఖ్యమైన సూచనలు:** ఇంటిపై నిఘా పెట్టుకొనేందుకు ఇంటి పరిసరాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇంటిలోకి ఇతరులు ప్రవేసించకుండా తలుపులను, కిటికీలను వేయాలని, బలమైన గడియలను, తాళాలను వేయాలన్నారు. ఇండ్లను తరుచూ గమనించే విధంగా నమ్మకమైన వ్యక్తులకు సమాచారం అందించాలన్నారు. రాత్రి సమయాల్లో ఇంటి ఆవరణంలో లైట్లు వెలిగేలా చూడాలన్నారు. ఇంటి పరిసరాల్లో అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నట్లయితే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100/112కు సమాచారం అందించాలన్నారు. విలువైన వస్తువులను, ఆభరణాలను ఇంటిలో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవడం ఉత్తమమన్నారు. బయట ప్రాంతాలకు వెళ్ళుతున్న విషయాలను సోషల్ మీడియాలోను, వాట్సాప్ స్టేటస్ ల్లో పెట్టవద్దని ప్రజలకు సూచించారు.

# వైభవంగా శ్రీ కోదండ రాముని బ్రహ్మోత్సవాలు







**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలో పెద్ద బజారులో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం సేవా కాలం, పారాయణ, చతుస్థాన అర్చన, మహా సుదర్శన హోమం, స్వామివారి తిరుమంజనం, సీతారాములకి పంచామృతాభిషేకం, చందనాభిషేకం టీటీడీ ఆగమ పండితులు శ్రీమాన్ గుడివర్తి అనంత వెంకట దీక్షితులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అనిల్ స్వామి, పవన్ స్వామి ఎంతో వైభవంగా నిర్వహించారు. రాత్రికి గజ వాహనంపై కోదండ రాముని ఊరేగింపు ఎంతో వైభవంగా జరిగింది. ఉదయం శ్రీ కోదండ రాముని ఆలయ అర్చకులు కన్నుల పండుగ అలంకరించారు. కీర్తిశేషులు అచ్యుత వెంకట లక్ష్మమ్మ ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. నేడు శనివారం శ్రీ సీతారాముల కళ్యాణం ఎంతో వైభవంగా జరగనున్నది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారి శెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, కోశాధికారి అప్పల మధు, ఆలయ కమిటీ సభ్యులు, ఉభయ దాతలు భక్తులు పాల్గొన్నారు.

# అమరావతిపై చంద్రబాబు మాట తప్పారు: శ్రీకాంత్ రెడ్డి



**అమరావతి,కలంకౌంటర్ :** రాజధానిపై చంద్రబాబు మాట మారుస్తున్నారని వైసీపీ నేత శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. అమరావతిని రెండేళ్లలో పూర్తి చేస్తానన్న వ్యక్తి, ఇప్పుడు అది 'నిరంతర ప్రక్రియ' అనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ కమిటీలు అమరావతిని రాజధానిగా చెప్పలేదని, కేవలం ఇన్సైడర్ ట్రేడింగ్ కోసమే చంద్రబాబు కమిటీల పేర్లు వాడుతున్నారని ఆరోపించారు. అమరావతిని 'దేవతల రాజధాని' అంటున్న బాబు, పరమశివుడు తిరుగాడిన కర్నూలుకు హైకోర్టు రాకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులను తాకట్టు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ భవనం చదరపు అడుగు రూ. 4 వేలకు కడితే, అమరావతిలో రూ. 12 వేలు ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. ప్రస్తుతం ఉన్న నగరాలను ఈ సొమ్ముతో అభివృద్ధి చేస్తే ఎంతో సంపద సృష్టించేవాళ్లమన్నారు. విట్, ఎస్ఆర్ఎం వంటి ప్రైవేటు సంస్థల కోసం వెంపర్లాడే బాబు, జగన్ తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను నిర్లక్ష్యం చేయడం దారు-ణమన్నారు. మిగతా రాష్ట్రాల్లాగే మనకూ ఒక మంచి నగరం ఉండాలని వైజాగ్ గురించి జగన్ చెబితే నానా యాగీ చేశారని విమర్శించారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం వంటి నగరాలను తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా చంద్రబాబు పట్టించుకోలేదని మండిపడ్డారు. చట్టబద్ధత పేరుతో అమరావతిని కేంద్రం చేతుల్లో పెట్టి రాష్ట్రానికి అన్యాయం చేశారని మండిపడ్డారు.

# అమరావతి చట్టాభద్దత పై ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ హర్షం




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధతను పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందడం పట్ల బంటుమిల్లి ఎన్జీవో అసోసియేషన్ నాయకులు కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది . బంటుమిల్లి ఎన్జీవో అసోసియేషన్ కార్యవర్గం సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ బంటుమిల్లి తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎం ఏసుదాసు మాట్లాడుతూ శాశ్వత రాజధాని గా అమరావతిని చట్టబద్ధత గుర్తింపు కల్పించే బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందడం ఆంధ్రులకుగర్వకారణం అన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు మరియు పదవీ విరమణ పొందిన పొందిన ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ చెల్లింపుల కోసం మొత్తం 70 59 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపినందుకు 184 7.83 కోట్లు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ 3411.03 కోట్లు గ్రాడ్యుటి బకాయిలు 1800 కోట్లు పదవి విరమణ పొందిన ఉద్యోగు లు లీవ్ ఎన్కాష్మెంట్ 222.47 కోట్లు పోలీస్ సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపు హర్షినియమన్నారు. అలాగే జిపిఎఫ్ కింద 1847.83 కోట్లు అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ ఇప్పటికే విడుదల జరిగిందన్నారు. ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించినందుకు వర్షం వ్యక్తం చేశారు అలాగే పెండింగ్ లో ఉన్న ఆర్థిక అంశాలపై త్వరలో పరిష్కరిస్తామని ముఖ్యమంత్రివర్యులు హామీ ఇవ్వడం సంతోషిదాయకం అన్నారు. ఎన్జీవో సమస్యలు పరిష్కారం కొరకు ప్రభుత్వ పెద్దలతో పలుమార్లు మాట్లాడి ఉద్యోగులకు రావలసిన బకాయిలను విడుదల చేస్తున్నందుకు రాష్ట్ర ఏపీ ఎన్జీ జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ మరియు ప్రధాన కార్యదర్శి డి వి రమణ గార్లకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో వై వి వి ప్రసాదరావు సహా అధ్యక్షులు, వి రాజీవ్ జాయింట్ సెక్రెటరీ, ఈ మేరీ జాయింట్ సెక్రెటరీ, బి రాజారావు కెవికెఎన్ మల్లేశ్వరరావు తదితరులు సమావేశం లో పాల్గొన్నారు



**గంపలగూడెం గ్యాస్ ఏజెన్సీ లో ఆకస్మిక తనిఖీ, వినియోగదారులతో ముఖాముఖీ నిర్వహించిన తిరువూరు ఆర్డీవో కుమార్**

–గంపలగూడెం,కలంకౌంటర్ :

# ధర్మం వైపు నిలబడిన మాజీ శాసనమండలి చైర్మన్ ఎంఏ షరీఫ్ - షేక్ మున్న



**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర రాజకీయాల్లో నిజాయితీ,ధర్మం, ప్రజాస్వామ్య విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మాజి శాసనమండలి చైర్మన్ ఎంఏ షరీఫ్.ఒత్తిడులు, బెదిరింపులు ఉన్నా కూడా నాడు మూడు రాజధానుల వికృత క్రీడను కౌన్సిల్ లో చైర్మన్ షరీఫ్ అడ్డుకొనకపోయివుంటే నేటి పరిస్థితులు మరో రకంగా ఉండేదని కందుకూరు నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షులు షేక్ మున్న అన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ కు షేక్ మున్న ధన్యవాదాలు తెలియజేశారు. శాసనమండలి చైర్మన్ గా ఆయన వెనుకడుగు వేయకుండా ధర్మం వైపు నిలబడటం ప్రతి ప్రజాప్రతినిధికి ఆదర్శం.నాడు శాసనమండలిలో చైర్మన్ ఉన్న షరీఫ్ పై వైసీపీ ప్రజా ప్రతినిధులు వ్యక్తిగతంగా దాడులు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండనీయమైనది. గతంలో శాసనమండలి వేదికగా తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ నిన్న మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఏ. షరీఫ్ భావోద్వేగానికి గురికావడం ముస్లిం సమాజంతో పాటు రాజకీయ వర్గాలను తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ప్రవర్తనకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసీపీకి 2024 లో తగిన సమాధానం చెప్పారు,రాబోయే కాలంలో కూడా మూల్యం చెల్లించక తప్పదు. గతంలోఆంధ్రప్రదేశ్ కు ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఉభయసభలు ఆమోదించటం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని,పార్లమెంట్ లో అమరావతికి చట్టబద్ధత బిల్లుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ మున్న కృతజ్ఞతలు తెలిపారు.

# మోసాలకు పాల్పడిన నిందితుడు అరెస్ట్ - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** ఇటీవల కాలంలో ဘాశ ఫ్లాట్ ఫార్మ్ వేదికగా కొందరు వ్యక్తులు వారి యొక్క ద్విచక్ర వాహనములు అమ్మకంకు పెట్టగా, దానిని గమనించిన సైబర్ నేరగాళ్లు సదరు వాహనం విక్రయదారులకి మరియు కొనుగోలుదారులకు ఒకరికి తెలియకుండా ఒకరికి మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ వాహనములు అమ్మకం చేయించి, ఆ డబ్బులను తెలివిగా తమ ఖాతాలకు జమ చేయించుకోవటం, తర్వాత వాహనం కొనుగోలుదారులు అసలు విషయం తెలుసుకోవటం జరుగుతున్నదన్నారు. ఈ తరహా మోసంకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని విజయనగరం 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి అరెస్ట్ చేసి, నిందితుడిని రిమాండుకు తరలించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. విజయనగరం 1వ పట్టణ పరిధిలోని వుడా కాలనికి చెందిన దాసరి ఉత్తేజ్ =జ200 మోడెల్ మోటార్ సైకిల్ ဘాశ లో చూసి, గుర్తు తెలియని వ్యక్తి ఖాతాలోకి రూ.60 వేలు పంపించి, మోసపోయాడన్నారు. గుంట్రెడ్డి సాయిరామ్ , రావుపల్లి గ్రామం , గరుగుబిల్లి మండలం, పార్వతీపురం మన్యం జిల్లా చెందిన వ్యక్తి ဘాశ లో పల్సర్ 150 జజ మోటార్ సైకిల్ చూసి గుర్తు తెలియని వ్యక్తికి రూ. 75 వేలు పంపించి మోసపోయాడన్నారు. పై ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదులపై రెండు కేసులు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలు, ఫోన్ పే, బ్యాంక్ అకౌంటులు పరిశీలన ద్వారా అసలు నిందితుడు అయిన చల్లా శంకర్ ఏ చరణ్, సి.వి.కండ్రిగ గ్రామం, తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా అను వ్యక్తిని వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపటం జరిగిందన్నారు. విచారణలో అరెస్ట్ కాబడిన వ్యక్తి తిరుపతి జిల్లా వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక హత్య కేసులోను, కృష్ణా జిల్లా పెనములూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రాత్రి పూట ఇంటి దొంగతనం కేసులలో నిందితుడిగా ఉన్నట్లుగా వెల్లడయ్యిందన్నారు. నిందితుడు నేరాలకు పాల్పడుతున్నప్పుడు 7842041808 , 9491964199, 8121846156 ఫోన్ నెంబర్లను వినియోగిస్తున్నాడని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

# పీఠాధిపతులను ఆహ్వానించిన దేవకి



**తెనాలి, కలంకౌంటర్ :** కనిగిరి పట్టణంలో ఈనెల 12వ తేదీ జరగబోయే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి శ్రీ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ )ని, వామనాశ్రమ స్వామీజీని శుక్రవారం వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు, శ్రీశైలం బోర్డు మెంబర్, కనిగిరి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ గౌరవాధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు దంపతులు పీఠాధిపతులను ఆహ్వానించారు. అనంతరం తెనాలి బుర్రిపాలెం రోడ్ లో వివేకానంద సెంట్రల్ స్కూల్ పక్కన శ్రీ బాల స్వామీజీ వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ గురు నిలయం( సువర్ణ భారతీయ క్షేత్రం) శంకుస్థాపన కార్యక్రమంలో దేవకీ దంపతులు పాల్గొన్నారు. పీఠాధిపతులకు నూతన వస్త్రాలు అందజేసి కనిగిరి కి ఆహ్వానించారు. అనంతరం వారి దంపతులకు బాల స్వామీజీ, వామనాశ్రమ స్వామీజీ ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


కలంకౌంటర్

KALAM COUNTER TELUGU DAILY | తెలుగు దినపత్రిక

కలంకౌంటర్ దినపత్రిక లో యాడ్స్ కోసం సంప్రదించండి..

సెల్ : 9346935672


# స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ..



**కందుకూరు,కలంకౌంటర్ :** స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో కందుకూరులోని అంబేద్కర్ సెంటర్లో చలివేంద్రం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ నిమిత్తం కందుకూరు పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ దాసరి రమేష్ 21000 వేలు అందజేయడం జరిగింది. వారు అందించిన సహాయంతో కొన్ని రోజులు మజ్జిగ పంపిణీ చేయవచ్చని నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా స్కంధపురి సేవా సమితి చైర్మన్ పువ్వాడి మౌనిక, దాసరి రమేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా స్కంధపురి సేవాసమితి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకి తమ వంతు సహాయం చేయాల్సిందిగా దాతలకు విజ్ఞప్తి చేశారు.




**మోపిదేవి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ముప్పిరిశెట్టి హరనాథ్ ( మోపిదేవి తహసీల్దార్ ) పదవీ బాధ్యతలు స్వీకరించారు. పారిశుధ్యం, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికలు జరిగి, కొత్త పాలక వర్గం వచ్చే వరకు తాను ఈ పదవిలో ఉంటానని ఆయన తెలిపారు.**

–మోపిదేవి,కలంకౌంటర్ :

# ఆర్యవైశ్యుల గడప గడపకు ఐ వి ఎఫ్

- ప్రమాణ స్వీకారాలకు సిద్ధం కావాలి
- ప్రతి జిల్లాకు 50 వేలు నుంచి లక్ష సేవా కార్యక్రమాలు
- ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు

**ఏలూరు,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఉన్న పేద,మధ్యతరగతి ఆర్యవైశ్యుల గడపకు ఐ వి ఎఫ్ సేవా కార్యక్రమాలు ద్వారా ముందుకు. సాగాలని రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు అన్నారు.రాష్ట్రంలో పేద,మధ్యతరగతి ఆర్యవైశ్యులకు అవకాశం ఉన్నంతవరకు అండగా ఉండి,ఐక్యత దిశగా ముందుకు వెళ్లాలని ఐ వి ఎఫ్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.అదే సభలో ఒక్కో జిల్లాకు 50 వేలు నుంచి లక్ష రూపాయలు వరకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు తన సొంత ఖర్చుతో నిర్వహిస్తానని తే.నిత్యవసర సరుకులు కిట్లు,కుట్టు మిషన్లు, గ్రైండర్లు,మెరిట్ స్టూడెంట్స్ కి లాప్ టాప్ లు,మహిళా మాతలకు చీరెలు వంటి వాటిని అందజేస్తామని స్పష్టం చేశారు.అందర్నీ సమన్వయం చేసుకుని అన్ని జిల్లాలు అధ్యక్షులు ఐ వి ఎఫ్ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని సందేశాన్ని ఇవ్వాలని కోరారు.అలాగే ఆర్యవైశ్యుల్లో రాజకీయంగా చైతన్యం పెంపొంది
ఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.



# మీడియా ప్రతినిధులకు స్వీట్లు తినిపించిన సీఎం





**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతికి చట్టబద్దత కల్పిస్తూ పార్లమెంటు ఆమోదించటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం ముఖ్యమంత్రికి అభినందనలు తెలియచేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మీడియా ప్రతినిధులకు స్వీట్లు తినిపించిన సీఎం.

# ఎంఎస్ఎంఈలతో యువతకు ఉపాధి - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత





**పెనుకొండ/శ్రీసత్యసాయి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆసక్తి కలిగిన యువత ముందుకొస్తే సబ్సిడీ రుణాలు అందజేసి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు వెన్నుదన్నుగా ఉంటామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కొండంపల్లి గ్రామంలో ఫెర్టిలైజర్స్, పౌల్ట్రీ ఫీడ్ విక్రయ శాలలను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తనను కలిసి విలేకరులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువతతో చిన్న, మధ్యతరహా పరిశ్రమ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేసి, వారికి వెన్నుదన్నుగా నిలువనుందని మంత్రి సవిత వెల్లడించారు.

**కూటమి రాకతో పంచాయతీలకు పూర్వవైభవం..** వైసీపీ పాలనలో నిధుల లేమితో పంచాయతీల్లో పాలన పడకేసిందని మంత్రి సవిత మండిపడ్డారు. పాడైపోయిన వీధి బల్బులను సైతం మార్చడానికి కూడా వీలుండేది కాదన్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఎందరో వైసీపీ సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, మరెందరో చేసిన అప్పులు తీర్చడానికి కూలీలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఆనాటి జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించారన్నారు. పంచాయతీలను దౌర్జన్యంగా గెలిపించుకోవడంలో ఉన్న శ్రద్ధ నిధులివ్వడంపై లేదని జగన్ నుద్దేశించి విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాకతో పంచాయతీలకు పూర్వవైభవం ప్రారంభమైందన్నారు. కేంద ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు నేరుగా పంచాయతీలకే అందజేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 22 నెలల కాలంలో గ్రామాల్లో గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి చోటుచేసుకుందన్నారు. 2025-26కు సంబంధించి గ్రామాల్లో జరిగిన అభివృద్ధికి గానూ ప్రతిష్టాత్మక అయిదు కేంద్ర ప్రభుత్వ అవార్డులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ గెలుచుకుందన్నారు. ఇదీ కూటమి ప్రభుత్వం పాలనకు మచ్చుతునక అని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితోనే 'విశ్వగురు'గా భారత్: ఏపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్

- నక్సల్స్ రహిత దేశంగా తీర్చిదిద్ది న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- విజయవాడ సత్యనారాయణ పురం లో శివాజీ వర్ధంతి వేడుకలు

**విజయవాడ, కలంకౌంటర్ :** మొగల్ సామ్రాజ్యంపై విరుచుకుపడి, హైందవ స్వరాజ్యాన్ని స్థాపించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ప్రతి భారతీయుడికి నిత్యం స్ఫూర్తిదాయకమని ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. తల్లి జిజియాబాయి అందించిన స్ఫూర్తితో శివాజీ మహారాజ్ అప్రతిహతమైన శక్తితో అనేక కోటలను నిర్మించి హైందవ సామ్రాజ్యాన్ని స్థాపించారని గుర్తుచేశారు రాయగడలో ఆయన పట్టాభిషిక్తుడైన నాటి నుంచి హైందవ చైతన్యం వెల్లివిరిసిందని, ఆయనను సాక్షాత్తు శివుని అవతారంగా ప్రజలు భావిస్తారని తెలిపారు. ఆంధ్ర ప్రాంతంతో శివాజీ మహారాజ్‌కు ఉన్న విడదీయరాని అనుబంధాన్ని వివరిస్తూ, ఆయన జైత్రయాత్ర విశాఖపట్నం వరకు సాగిందని, శ్రీశైల పుణ్యక్షేత్రంలో ఆయన తపస్సు చేశారని మాధవ్ వివరించారు నేటి తరుణంలో దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తున్న విజాతీయ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, స్వధర్మం పట్ల అభిమానం కలిగి ఉండాలని మాధవ్ పిలుపునిచ్చారు . మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా వామపక్ష హింసావాద ఉగ్రవాదాన్ని (నక్సలిజం) అణచివేయడంలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా నేతృత్వంలోని ప్రభుత్వం సాధించిన విజయాన్ని అద్భుతమని మాధవ్ అభివర్ణించారు . ప్రస్తుతం ప్రపంచమంతా మతోన్మాదంతో యుద్ధాలు (ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-ఇరాన్ వివాదాలు) చేసుకుంటున్న తరుణంలో, 'సర్వధర్మ సమభావన' కలిగిన శివాజీ మహారాజ్ ఆశయాలే భారతదేశాన్ని



'విశ్వగురు' స్థానంలో నిలబెడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు శివాజీ మహారాజ్ ఆశయాలను ప్రతి వాడవాడలా తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరూ ఆయనలా దేశ రక్షణకు కంకణబద్ధులు కావాలని కోరారు . ఈ కార్యక్రమంలో విగ్రహ స్థాపనలో కీలక పాత్ర పోషించిన నిర్వాహకులను, కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, ఆర్ ఎస్ ఎస్ ప్రతినిధి కృష్ణ నాగలింగంశివాజీ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ టెక్స్ టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతాం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తెలంగాణ, కలంకౌంటర్ :** వస్త్ర పరిశ్రమ రంగంలో 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే గొప్ప టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. టెక్స్‌టైల్ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చగల వాతావరణాన్ని సృష్టించడంలో మాతో భాగస్వామ్యం కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ తో కలిసి 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సు ను నిర్వహించింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి అటెక్స్‌కాన్-2026 నివేదికను విడుదల చేశారు. ఈ సదస్సులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , తుమ్మల నాగేశ్వర రావు , అధికారులు, జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి మంత్రులతో కలిసి సందర్శించారు. సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర భారతదేశానికి ఉంది. శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్స్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయి. నిజాం కాలంలో ప్రపంచ నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్ నగరానికి వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలదు. టెక్స్‌టైల్స్ మా డీఎన్ఏలో ఉంది. వస్త్ర పరిశ్రమలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయి. దేశంలో పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాం. పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరుంది. టెక్స్‌టైల్ తెలంగాణకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. ప్రజల జీవనాధారం. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వరకు అనేకం ఇక్కడున్నాయి. తెలంగాణలో నైపుణ్యం ఉంది. మంచి సంకల్పం కూడా ఉంది. డీప్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ వంటి అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉంది. వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశాం. అందులో అనేక అప్పరెల్ పార్కులున్నాయి. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ద్వారా 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం.వస్త్ర పరిశ్రమకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుంది. అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తుంది. ప్రపంచ పోటీకి అనుగుణంగా విధానాలు అనుసరిస్తున్నాం. అత్యుత్తమ మానవ వనరుల బలం ఉంది. తెలంగాణలోని పత్తి పొలాలకు.. లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోలకు అనుసంధానం కావాలి. మీకు విజన్ ఉంటే, మేము సరైన భాగస్వాములం అవుతాం. అందరం కలిసి, ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దాం. హైదారాబాద్ గ్లోబల్ సినిమా హబ్ గా ఎదుగుతోంది. ఇటీవల నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించాను. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుండగా, ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరింది. సినిమా సంబంధిత ఫ్యాషన్ రంగాన్ని కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తాం. పరిశ్రమల అభివృద్ధితోపాటే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తాం. సంప్రదాయ ఆలోచనలతో పాటు ఆధునిక పరికరాలతో కలిపి డిజైన్, కట్టింగ్, స్టిచింగ్‌లో యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్షణనిస్తాం. ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయాలన్నది మా సంకల్పం. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలి..” అని ముఖ్యమంత్రి గారు పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు.




# స్వచ్ఛాయుధం' -- 'స్వచ్ఛ యోధులు'తో ప్లాస్టిక్ రహిత నగర నిర్మాణానికి శ్రీకారం ---- జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగరాన్ని ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా, శుభ్రంగా, పచ్చదనంతో నింపిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ శుక్రవారం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని రహదారులు భవనాలు శాఖ అతిథి గృహం సమీపంలోని ఎన్జీఓస్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని, 'స్వచ్ఛాయుధం' అనే సాధనం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన నగరాన్ని నిర్మించగలమని అన్నారు. మచిలీపట్నం నగరాన్ని ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సులభంగా ఏరేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ఒక సాధనాన్ని పరిచయం చేశారు. కింద భాగంలో చిన్న మేకు అమర్చిన కర్రను స్వచ్ఛాయుధంగా పిలుస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా రోడ్లు, వీధులు, ప్రజా ప్రదేశాల్లో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను సులభంగా సేకరించవచ్చని పేర్కొన్నారు. అలాగే, తమ ప్రాంతంలో ప్రతిరోజూ 15 నుంచి 30 నిమిషాల పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారిని 'స్వచ్ఛ యోధులు'గా గుర్తించనున్నట్లు తెలిపారు. సమాజం కోసం సేవా దృక్పథంతో ముందుకు వచ్చే యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం మచిలీపట్నంలో ప్లాస్టిక్ లిట్టరింగ్‌ను తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, అలాగే మున్సిపల్ సిబ్బంది డ్రైన్ క్లీనింగ్, కమర్షియల్ శానిటేషన్ వంటి ఇతర కీలక పనులపై మరింత సమయం కేటాయించేలా చేయడం అని జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రజల సహకారంతో నగరాన్ని అందరూ గర్వించేలా క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దవచ్చని ఆయన అన్నారు. “మన నగరం -- మన బాధ్యత” అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆసక్తి గల వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకుని 'స్వచ్ఛ యోధులు'గా సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో నగర కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, ఎన్నారై డాక్టర్ వడ్లమూడి రాజేంద్ర, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ పి శ్రీరామ్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు






**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పెద్ద బజారునందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న మహోత్సవాల్లో గురువారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, విద్యాశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు పాల్గొన్నారు. శుక్రవారం మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు వీరికి ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం, స్వామి వారి శేష వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com